నేడు కుసుమ హరనాథ జయంతి

నల్లకుంట: నల్లకుంట ప్రశాంత్‌నగర్‌లోని కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం(నేడు) కుసుమహరినాథ 160వ జయంతి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవతో జయంతి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జయ హరనాథ జయ కుసుమ కుమారి జయ 'అర్ధ ఏకాహం' మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

ఎన్‌సీసీకి ప్రత్యేక గుర్తింపు



సర్టిఫికెట్లు అందజేస్తున్న పులిగారి గోవర్ధన్ రెడ్డి

కవాడిగూడ: దేశ సేవలో ఎన్‌సీసీకి ప్రత్యేక గుర్తింపు ఉందని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థి ఎన్‌సీసీలో చేరి తమ జీవితాన్ని దేశ సేవకు అంకితం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం కవాడిగూడలోని ఇంగ్లిష్ యూనియన్ హైస్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం అనంతరం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పులిగారి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్‌సీసీ విద్యార్థులు దేశ రక్షణ రంగంలో చేరవచ్చని ఇది మంచి అవకాశమన్నారు.

నేడు అమ్మవారి ఘటం ఊరేగింపు



అంబర్‌పేట: అంబర్‌పేట మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపు నేడు (ఆదివారం) ఘనంగా ప్రారంభించనున్నట్లు అలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారు శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తుందన్నారు. సాయంత్రం 6 గంటలకు ఘట ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అభినందనలు



రాంచందర్ రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సూర్యప్రకాష్ సింగ్

కాచిగూడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ క్రేన్‌తో భారీ పూలు, పండ్లమాలతో స్వాగతం పలికారు. బీజేపీ సీనియర్ నేత ఎస్. సూర్యప్రకాష్ సింగ్ నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు రాంచందర్‌రావును పార్టీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బల్వీర్, శేర్‌సాగర్, భీమ్‌రాజ్, సంతోష్, లావణ్య, రవియాదవ్, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

మనోజ్‌రెడ్డి ఉత్తమ వైద్యశాఖ అవార్డు



ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి జిల్లా ఉత్తమ వైద్యశాఖ అధికారిగా అవార్డు అందుకున్నారు. నేషనల్ డాక్టర్స్ డేను పురస్కరించుకొని శనివారం ఉత్తమ వైద్యశాఖ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందన చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని శనివారం ఫర్‌యు సంస్థ చైర్మన్, సామాజికవేత్త జి.శ్రీనునాయుడు ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అనేక పాఠశాలల్లో కనీసం పిల్లలు ఆడుకోవడానికి గ్రౌండ్ కూడా లేదని ఒక్కో తరగతి గదిలో 80–100 మంది విద్యార్థులు ఉంటున్నారని తెలిపారు. అంతేకాక ప్రాజెక్టుల పేరిట డబ్బులను వృథా చేయించడంతో పాటు, అడ్మిషన్ల పేరిట అధిక డబ్బులు దండుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీను నాయుడు

కమ్యూనిటీ హాల్.. సౌకర్యాలు నిల్



గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్ భవనం



ఆవరణలో చెత్తాచెదారం, మందుబాటిళ్లు

చిక్కడపల్లి: ప్రజల సౌకర్యార్థం నిర్మించిన కమ్యూనిటీ హాళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తుండంతో నిరుపయోగంగా మారుతున్నాయి. గాంధీనగర్ డివిజన్‌లోని విశాలమైన జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్లో వసతులు కల్పించాలని పలుమార్లు అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథులే లేరని స్థానికులు వాపోతున్నారు. జీ ప్లస్ గ్రౌండ్‌ఫ్లోర్ ఉన్న కమ్యూనిటీహాల్లో గత కొన్ని సంవత్సరాలుగా వైరింగ్ పాడైపోయిన పట్టించుకోవడంలేదు. అంతేకా రెండు పవర్‌బోర్లు ఉన్నప్పటికి వాటి ఊసే ఎత్తడం లేదు. అరుంధతినగర్, సబర్మతినగర్, నేతాజీనగర్, సబర్మతినగ్‌ర, అసోక్‌నగర్, చిక్కడపల్లి, బాపూనగర్, వాల్మీకినగర్, బాపునగర్, సంజీవయ్యనగర్ బస్తీలలోని ప్రజలు వివిధ శుభకార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకుంటారు. ఈ కమ్యూనిటీ హాల్లో ఎలాంటి వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా కార్యక్రమం నిర్వహిస్తే నీళ్ల కూడా ట్యాంకర్‌ల ద్వారా తెప్పించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. కమ్యూనిటీహాల్ పక్కన చెత్తాచెదారం, ప్లాస్టిక్ బాటిళ్లు, మందుబాటిళ్లు పేరుకుపోయాయి. కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కమ్యూనిటీ హాల్‌లో మెరుగైన వసతులు కలికల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: భోలక్‌పూర్‌లో దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు అధ్వానంగా మారడంతో వాటిని ఆధునీకరించేందుకు రూ. 85 లక్షలతో సీసీ రోడ్డు వేశామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. భోలక్‌పూర్ డివిజన్‌లోని బంగ్లాదేశ్ మార్కెట్, సిద్దిక్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ డీఈ సన్నీతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చార్మినార్‌ను తలపించే విధంగా బంగ్లాదేశ్ మార్కెట్‌లో వస్త్రవ్యాపారం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఆధునిక సీసీ రోడ్లు వేశామన్నారు. అంతకు ముందు పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ, వాటర్ పైపులైన్ పనులు పూర్తి చేశామన్నారు. ప్రజల అవసరాలను తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ముఠా జైసింహ, శ్రీనివాసరావు, రహీం, ఉమాకాంత్, చాంద్‌పాషా, శంకర్‌గౌడ్, జునైద్ బాగ్దాది, మున్వర్ చాంద్, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపటి నుంచి గురుపౌర్ణమి మహోత్సవాలు



నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా మందిరంలో సోమవారం (రేపు) నుంచి 10వ తేదీ వరకు గురుపౌర్ణమి మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని సంస్థాన్ ప్రతినిధులు తెలిపారు. సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం7.30 వరకు అలయ పారాయణ బృందంచే శ్రీ సాయి అఖండ ఏకనామ సంకీర్త ఉంటుందన్నారు. 8 వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణతో సాయిబాబాకు లక్షపుష్పార్చన ఉంటుందని చెప్పారు. 10న ఉదయం 10 గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణముతో సాయిబాబాకు 'లక్ష పుష్పార్చన' ఉంటుందని వివరించారు. కలశ పూజకు ఎలాంటి రుసుం లేదని, అవసరమైన పూజ సామగ్రిని భక్తులే సమకూర్చుకోవాలని ట్రస్ట్ ప్రతినిధులు పేర్కొన్నారు. కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముషీరాబాద్: టీయూసీఐ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జూలై 9వ జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ, జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని శాశ్వత పర్చడానికి ఫిక్స్ టర్మ్ కాంట్రాక్టు విధానాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ పేరుతో కార్మిక వర్గానికి మరణ శాసనాన్ని రాస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యుల రైజ్ చేసే వరకు పోరాడాలన్నారు. అనంతరం సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో శివరంజని, పి.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మెహర్, శంకర్ పాల్గొన్నారు.

పరిశ్రమల నివారణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. సిగాచీ పరిశ్రమ ప్రమాద బాధిత కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని, వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిశ్రమాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. సిగాచీ ఫార్మా కంపెనీలో జరిగిన ఘటనలో 41 మంది మరణించగా 50 మందికి పైగా గాయపడ్డారని 5 రోజులైనా ఇంకా 10 మంది కార్మికులు ఆచూకి దొరకక పోవడం బాధాకరమన్నారు. సూర్య మాట్లాడుతూ.. సులభతర వ్యాపారం పేరుతో పాలకులు తీసుకొస్తున్న విధానాలతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చుక్క రాములు, నివాస్, రాములు, వెంకటేష్, రమ, పద్మ, వీఎస్ రావు పాల్గొన్నారు.

రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలి



దండి వెంకట్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ ఫ్యాక్టరీలో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు రూ. కోటి, క్షతగాత్రులకు రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ఎర్ర తివాచీ పరచడం కాదని.. ఆ కంపెనీలు కార్మిక చట్టాలకనుగుణంగా ఏర్పాటు చేస్తున్నరో లేదో పరిశీలించడానికి ఒక ఉన్నతస్థాయి కమిటీని వేయాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక



గిరిధర్‌గౌడ్



కృష్ణగౌడ్

అంబర్‌పేట: అంబర్‌పేట గౌడ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం అంబర్‌పేటలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా పంజాల గిరిధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా తొలుపునూరి కృష్ణగౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం ఐక్యత, అభివృద్ధికి పాటు పడుతామన్నారు.

రూ.2.5 కోట్ల అభివృద్ధి పనులు

మలక్‌పేట: అభివృద్ధిలో రాజీపడే ప్రసక్తి లేదని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని సలీంనగర్, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ, మూసారంబాగ్, గడ్డిఅన్నారం ప్రాంతాలలో శనివారం రూ.2.5 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్త సీసీ రోడ్లు, కమ్యూనిటీహాళ్లు, జిమ్ పరికరాలు, పార్కుల్లో కొత్త వాకింగ్ ట్రాక్, తాగునీటి పైపులైన్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని, బస్తీలు, కాలనీలలో మరిన్ని వసతులు కల్పించేందుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, జీహెచ్‌ఎంసీ ఏఈ శరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు, వాటర్‌వర్క్స్ డీజీఎం హస్మత్‌అలీ, ఏఎంహెచ్‌వో రుద్ర శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ నరేందర్, హార్టికల్చర్ మేనేజర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పార్కింగ్.. పరేషాన్

మలక్‌పేట: చిన్న చిన్న గల్లీల్లో దారికి ఇరువైపులా వాహనాలను పార్కిగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తెల్తుతున్నాయిన బాటసారులు వాపోతున్నారు. గడ్డిఅన్నారం, దిల్‌సుఖ్‌నగర్ ఆనుకుని ఉండటంతో ప్రైవేట్ హాస్టళ్లు, వ్యాపార సంస్థలు అధికంగా వెలిశాయి. ప్రైవేట్ హాస్టళ్లకు పార్కింగ్ స్థలం లేకపోవడంలో హాస్టళ్ల ముందున్న రోడ్లపై ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో దారంతా కుంచించుపోయి నడిచేందుకు వీలు లేకుండా పోతుంది. తమ ఇళ్లకు వెళ్లేదారి లేకుండా పోతుందని ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

సన్మానం

సైదాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన రామచంద్రరావుకు సైదాబాద్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారానికి ముందు చార్మినార్ వద్ద అమ్మవారి పూజల్లో రామచంద్రరావుతో పాటు సుభాష్‌చందర్‌జీ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

చాదర్‌ఘాట్: ఈ నెల 20, 21 తేదీలలో ఓల్డ్‌మలక్‌పేటలో జరిగే బోనాల సందర్భంగా ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ ముద్రించిన ఉత్సవాల పోస్టర్లను శనివారం శ్రీపోచమ్మ దేవాలయ ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు.

ఆలయాల ముస్తాబు

దిల్‌సుఖ్‌నగర్: తొలి ఏకాదశి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మలక్‌పేట్ జోన్ పరిధిలోని అమ్మవారి ఆలయాలను సిద్ధం చేశారు. ఆర్‌కేపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి ఆలయం, మలక్‌పేట్‌లోని శ్రీఅండాళ్ నిలయం, ఐఎస్‌సదన్, సైదాబాద్, మాదన్నపేట,సరూర్‌నగర్ తదితర ప్రాంతాలోని వైష్ణవ ఆలయాలను అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సహకార రంగానికి ప్రాధాన్యం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాబోయే కాలంలో యువత సహకార రంగం వైపు మళ్లేలా కృషి చేస్తున్నామని టీజీసీయూ చైర్మన్ మనాల మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిజాం కళాశాల విద్యార్థులకు నెల రోజులపాటు సహకార సంఘాలు వాటి ప్రాధాన్యతపై శిక్షణ ఇచ్చిన అనంతరం వారికి సర్టిఫికెట్, మెమెంటోలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మనాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో సహకార రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి యువత సహకార రంగంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీస్ తెలంగాణ, కో ఆపరేటివ్ కమిషనర్ సురేంద్ర మోహన్, అడిషనల్ రిజిస్ట్రార్ గురుజాల శ్రీనివాసరావు, అన్నపూర్ణ, నిజాం కాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



ప్రత్యేక లైటింగ్ బోర్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో పార్కుల సుందరీకరణ పనుల్లో భాగంగా కెనరా బ్యాంక్ పార్కులో ఏర్పాటు చేసిన ఐ లవ్ గాంధీనగర్ అని ప్రత్యేక లైటింగ్ బోర్డును ఎంతో ఆకర్షిస్తుందని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం ఆమె పార్కులో ఏర్పాటు చేసిన ప్రత్యేక లైటింగ్ బోర్డును జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పార్కులలో పాత్‌వే, ఫెన్సింగ్, వాకర్స్ కోసం పాత్‌వే, పూలమొక్కలు వంటి సుందరీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. నియోజవర్గంలో గాంధీనగర్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్, ఏఈ అబ్దుల్ సలాం, వర్క ఇన్‌స్పెక్టర్ మహేష్, ఆనంద్ రావు, సాయికుమార్, అరుణ్‌కుమార్, జ్ఞానేశ్వర్, నీరజ్ పాల్గొన్నారు.

గ్రామగ్రామానా దండోరా జెండాను ఎగరవేద్దాం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గ్రామ గ్రామాన దండోరా జెండాను ఎగరవేయాలని రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూలై 7 నాటికి 31 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దండోరా ఆవిర్భావ దినోత్సవం మహనీయుల చిత్రపటాలతో పాటు మాదిగ అమరవీరుల చిత్రపటాలను స్మరించుకుని గ్రామ గ్రామాన జెండా ఆవిష్కరణ చేయాలన్నారు. 31 సంవత్సరాలుగా మాదిగ జాతి ఆత్మగౌరవం కోసం ఉద్యమంలో పాల్గొన్న సీనియర్ నాయకులందరినీ ఏకతాటిపైకి తెచ్చిన త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనతో పాటు భవిష్యత్‌లో మాదిగల ప్రత్యేక వాటాకై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్, చందు, తిరుమల్లేష్, జీవన్, నాగరాజు, సురేష్, శ్యామ్‌రావు, మనీ, ఫణీ పాల్గొన్నారు.

చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

నల్లకుంట: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. నల్లకుంటకు చెందిన వెంకట రామలింగేశ్వర రావు, సునీల్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి ఒకొక్కరికి మంజూరైన 60 వేల చెక్కులను శనివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ కుమార్ జోషి, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

అర్హులకు అందేల కృషిచేస్తా..

అంబర్‌పేట: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకుంటానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బాగ్ అంబర్‌పేటకు చెందిన బనోతు భద్రమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.60 వేల చెక్కును శనివారం ఆయన తన కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.గౌతంరావు, గోవర్ధన్‌రెడ్డి, చుక్క జగన్, ఎడెల్లి బాలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



కళాకారుల వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు

చిక్కడపల్లి: తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం చిక్కడపల్లిలోని కార్యాలయంలో సాంస్కృతిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదగిరి సమక్షంలో వివిధ జిల్లాల నూతన కన్వీనర్లను ఎన్నుకున్నారు. వరంగల్ జిల్లా కన్వీనర్‌గా కొయ్యాడ రాజేష్, సిద్ధిపేట జిల్లా కన్వీనర్‌గా స్వరూపరాణి, కో కన్వీనర్‌గా బాల్ లక్ష్మమ్మ, గజ్వేల్ జిల్లా యాదగిరి, చంద్రకళ, నాగర్ కర్నూల్ జిల్లా కొంపల్లి సాయిలు, మాదుగుల వెంకటయ్య, మెదక్ జిల్లా కొండలు, యాదగిరి సంగారెడ్డి జిల్లా రేణుక, యాదాద్రిభువనగిరి జిల్లా సుగుణమ్మ, లావణ్య, రంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా ఇందిర ఎన్నికయ్యారు.

3 రోజుల కస్టడీకి పూర్ణచందర్ నాయక్

చిక్కడపల్లి: న్యూస్ చానల్ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో రిమాండ్‌లో ఉన్న పూర్ణచందర్ నాయక్‌ను చిక్కడపల్లి పోలీసులు శనివారం సాయంత్రం మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. ఈ మేరకు కోర్టులో శుక్రవారం వాదనలు జరగగా శనివారం కోర్టు ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలు నుంచి పూర్ణచందర్‌నాయక్‌ను కస్టడీలోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ తెలిపారు.

హమాలీల పాత్ర కీలకం

చాదర్‌ఘాట్: హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిలో హమాలీల పాత్ర కీలకమైందని ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి అన్నారు. ఆయన ఎస్‌జీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శనివారం అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం నాయకులు ఆయనను మార్కెట్ కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎస్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో పని చేసే లైసెన్స్‌డ్ హమాలీలకు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రెండు జతల యూనిఫామ్‌లు, ఐడీ కార్డులు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మార్కెట్‌లో పనిచేసే కార్మికులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్–3 కార్యదర్శి పుష్ప, సూపరింటెండెంట్ మాధురి, జలజాక్షి, అఖిల, హైదరాబాద్ హమాలీల సంఘం అధ్యక్షుడు సురేష్, శేఖర్, కథలయ్య, రవీందర్, కుమార్, రాజు, మురళి, నర్సింగ్‌రావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప వివరాల ప్రకారం.. గుర్తు తెలియని ఓ వ్యక్తి (25) విద్యానగర్– కాచిగూడ రైల్వే స్టేషన్ల నడుమ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడు ముస్లిం వర్గానికి చెందిన వాడని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించామన్నారు.

IN THE COURT OF THE HON'BLE XXV ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD
O.S.No. 220 OF 2025

BETWEEN:
GUNDI HARI PRASAD And others ...PLAINTIFFS
AND
THE MANDAL REVENUE OFFICER, Amberpet Mandal And others...DEFENDANTS
D-9 ALL CONCERNED

PUBLIC NOTICE

The Plaintiffs had filed the above suit for Declaration to declare the Plaintiffs as the only legal heirs and successors of Late Smt.Gundi Shashikala in respect of House Bearing H.No.2-2-1145/3, admeasuring 116 Sq.yards Situated at New Nallakunta, Hyderabad, Telangana State-500044 and bounded as North: Plot No.11/B, South: 35' Wide Road, East: Owners House, West: Neighbours Compound Wall. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to 22.07.2025 at 10.30 a.m. Therefore, you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.

(BY ORDER OF THE COURT)
Sd/- GVGA CHAKRAVARTHY, M.HEMA CHANDRA, V.CHAKRI PHANI KUMAR, Advocates,
D.No.1, First Floor, # H.No.2-3, Chandanagar, Ranga Reddy District.